# తల్లిప్రేమ

— ప్రతాప రవిశంకర్




శ్యామలరావు ఇంటికొచ్చేసరికి చీకటి పడింది. పది నిముషాల క్రితమే దీపాలు వెలిగాయి. అతను ఇంట్లోకి అడుగు పెట్ట

గానే-"ఏమండీ! రామిగాడు ఎక్కడికో వెళ్ళిపోయాడండీ! ఇంట్లో లేడు" అన్నది భార్య శారద ఆత్రంగా.

"వాడా! వాడెక్కడికి కెళతాడే? ఏ స్నేహితుడి ఇంటికో వెళ్ళి వుంటాడు" అన్నాడు షర్టు విప్పుతూ.

"నా కలా అనిపించటం లేదు. చీకటిపడినా ఇల్లు చేరలేదు. నాకెందుకో భయంగా వుంది" అన్నది మళ్ళీ.

"నోర్ముయ్! అసలు నువ్వే వాడిని ఇంతవరకు తీసుకొచ్చావ్! పెద్ద కొడుకని గారాభం చేశావ్. వాడు వెధవలా తయారయ్యాడు. నీ అలుసు చూసుకునే ఎన్ని దెబ్బలు కొట్టినా వాడు మొదటికి వస్తున్నాడు" అని శారదమీద విరుచుకు పడ్డాడు.

శారద మళ్ళీ నోరెత్తలేదు.

రెండో కొడుకు మురళి గోడ నానుకుని కూర్చుని-తల్లీ, తండ్రి వైపు భయంగా చూస్తున్నాడు. వాడికి ఆరేళ్ళు వున్నాయి. మూడేళ్ళ పాప గచ్చుమీద పడుకుని నిద్ర పోతోంది.

ఆ రోజు మధ్యాహ్నం శ్యామల రావు పెద కొడుకు రాముడిని చచ్చేట్టు కొట్టాడు. వాడు ఆ రోజు ఉదయం కూడా స్కూలుకు వెళ్ళలేదని తెలిసింది. ఎక్కడికి వెళ్ళాడో తెలీదు. ఎంత అడిగినా ఎక్కడ తిరిగి వచ్చిందీ, ఏం చేసిందీ చెప్పలేదు. రాముడు వారానికి మూడు రోజులే స్కూలుకు వెళతాడు. మిగిలిన రోజులు ఎక్కడో తిరిగి వస్తాడు. శ్యామలరావుకు ఈ విషయాలు ఎప్పటికప్పుడే తెలుస్తాయి. అతనే తెలుసుకుంటాడు. తెలుసుకుని వాడిని చచ్చేట్టు కొడతాడు. అయినా వాడి బుద్ధి మారలేదు.

ఇవాళ కూడా రామిగాడు వాళ్ళ నాన్నచేత చచ్చేట్టు తన్నులు తిన్నాడు.

రాత్రి ఎనిమిదయింది.

రామిగాడు ఇంటికి రాలేదు.

శారద మళ్ళీ నోరు తెరిచింది-

"ఇప్పుడైనా వాడెక్కడికి వెళ్ళాడో చూసి రండి" అన్నది కంగారుగా.

"వాడే వస్తాడు. బయట వాడికి గుప్పెడు మెతుకులు పెట్టే వాళ్ళు ఎవ్వరూ లేరు. కడుపులో కాలితే వాడే వస్తాడు" అన్నాడు.

అలా అన్నాడే గానీ, అతనికీ మనసులో అనుమానంగానే వుంది కొడుకు గురించి- వాడు ఇక ఇంటికి తిరిగి రాడేమో!

ఎవ్వరూ భోజనాలు చెయ్య లేదు. చిన్న కొడుక్కి మాత్రం అన్నం పెట్టింది. ఎందువల్లనో వాడు సరిగ్గా అన్నం తినలేదు. వాడికీ భయంగానే వుంది.

పదయ్యింది.

"నేనే వెళ్ళి చూసొస్తాను" అన్నది శారద ఇక అతనితో లాభం లేదన్నట్టుగా.

శ్యామలరావు మాట్లాడలేదు. మౌనంగా షర్టు వేసుకున్నాడు. చెప్పులు తొడుక్కుని బయటకు నడిచాడు.

"అన్ని చోట్లా బాగా వెతకండి" అన్నది శారద బయటవరకూ వచ్చి. అలా అంటున్నప్పుడు ఆమె గొంతు చిన్నగా వణికింది.

ఎంత చెడిపోతున్నాడనుకున్నా వాడు కన్న కొడుకు. వాడిని చూడకుండా తను వుండలేదు. ఇంతకీ వాడు కనపడతాడో-లేదో?

కుర్చీలో కూలబడింది.

మురళి నిద్రలోకి జారిపోయాడు.

చూస్తూండగానే టైము గడిచిపోయింది.

పదకొండు....పన్నెండు.

శ్యామలరావు ఒంటి గంట అవుతుండగా ఒంటరిగానే తిరిగి వచ్చాడు.

"ఏడీ వాడు?" ఏడుపును ఆపుకుంటూ అడిగింది శారద.

"కనిపించలేదు." చిన్నగా అన్నాడు చెప్పులు విడుస్తూ.

అక్కడే కూలబడిపోయింది. తరువాత చిన్నగా ఏడవటం మొదలు పెట్టింది.

శ్యామలరావుకి తన మీద తనకి బాగా అసహ్యం కలిగింది.

"భయపడకు. వాడే వస్తాడు. తప్పకుండా వస్తాడు" అన్నాడు శారద వీపు మీద చెయ్యి వేసి.

విసురుగా తలెత్తింది శారద. "మీరే....మీరే వాడిని నా నుండి దూరం చేశారు. ఇక రాడు. వాడు మనకు కనపడడు. వాడేం తక్కువ? వాడు మీ కొడుకు కదూ? మీరు మాత్రం చేసిందేమిటి? వాడికి మీ పోలికే వచ్చింది. మీ పౌరుషమే వచ్చింది." ఏడుస్తూనే అన్నది.

శ్యామలరావు అక్కడే వున్న కుర్చీలో కూర్చున్నాడు.

శారద మాటల్లో అతనికి అసత్యమేదీ కనిపించలేదు.

అవును! వాడికి తన పోలికే వచ్చింది. తను మాత్రం పదమూడో యేట ఇంట్లోనించి వెళ్ళిపోలేదూ?

వద్దనుకున్నా అతనికి గుర్తొచ్చింది గతం.

అప్పటికి తల్లి పోయి రెండేళ్ళయ్యింది. తండ్రి మరో పెళ్ళి చేసు

కున్నాడు. ఆమె ఆయనకు భార్యే అయింది కానీ, తనకు తల్లి కాలేదు. తనమీద నేరాలు కల్పించి ఆయనతో చెప్పింది. ఆమె మీద వున్న వ్యామోహం కొద్దీ ఆయన నమ్మాడు. తనని చావబాదాడు. కొన్నాళ్ళు భరించాడు. తర్వాత సాధ్యం కాలేదు. అందుకే ఓ రోజు ఇంట్లో నించి వెళ్ళిపోయాడు. ఎట్లాగో గాలికి పెరిగాడు. ఎలాగయితేనేం-చివరికి ప్రయోజకుడయ్యాడు. ఎప్పటికో తన అమాకీ తండ్రికి తెలిసింది. అంతకు ముందు తండ్రి తన గురించి పేపర్లో వేయించాడు. రేడియోలో చెప్పించాడు. పిటీ యేమిటంటే తండ్రికి తను తప్ప పిల్లలు లేరు. తనని ఆయన దగ్గరకు రమ్మని ఎంతగానో బ్రతిమాలాడు. తను వెళ్ళలేదు. ఇప్పటికీ వెళ్ళలేదు. వెళ్ళడు కూడా. తండ్రి మీద తన మనసులో ఒక భావం ఏర్పడి పోయింది. అది ఇప్పటికీ మారలేదు.

ఇప్పుడు రామిగాడి కూడా తనలాగే....

ఆ రాత్రి ఇద్దరూ నిద్రపోలేదు.

మరురోజు ఉదయం మరోసారి వూరంతా గాలించాడు శ్యామలరావు. రామిగాడి జాడ లేదు. వెంటనే ఈ వార్త పేపర్లో వేయించాడు. ఫోటో కూడా వేయించేవాడే. కాని రామిగాడి ఫోటో లేదు. మరీ చిన్నతనంలో ఫోటో వుంది. దాన్ని వేయించినా ఎవ్వరూ గుర్తు పట్ట లేరు. వాడి గురించి రేడియోకి కూడా తెలియ బరిచాడు.

ఒకరిద్దరిని తమ బంధువుల ఇంటికి పంపించాడు శ్యామలరావు. మరురోజు ఉదయానికి వాళ్ళు రామిగాడు ఎక్కడా లేడనే వార్తను మోసుకు వచ్చారు.

"ఇక నాకు మిగిలింది ఒక్క కొడుకే" అని బావురుమన్నది శారద- ఆ వార్త విన్న తర్వాత.

భార్యను ఓదార్చలేక పోయాడు అతను.

ఆ రోజు కూడా ఆఫీసుకు సెలవు పెట్టాడు. అతనికి మనసులో బాధ మెలి తిరుగుతోంది. అయినా బయటకు గంభీరంగా వున్నాడు. వాడు తిరిగి వస్తాడనే ఆశ అతనిలో ఎంత మాత్రమూ లేదు.

వాడిక రాడు.

క్రమంగా చీకటి పడబోతోంది.

గోడ నున్న గడియారం కేసి చూశాడు శ్యామలరావు.

తర్వాత రేడియో ఆన్ చేశాడు.

స్థానిక ప్రకటనలు వస్తున్నాయి. వరుసగా ఇంట్లో నించి వెళ్ళి పోయిన వారి గురించి చెబుతున్నారు.

రామిగాడి పేరు కూడా వచ్చింది.

మూడు రోజుల క్రితం ఇంట్లోనుంచి వెళ్ళిపోయాడనీ, ఆ చూకీ తెలిసిన వాళ్ళు ఈ అడ్రసుకు తెలియ పరచ వలసిందనీ చెబుతున్నాడు ఎనౌన్సర్.

వింటున్న శ్యామలరావు గుమ్మం దగ్గర ఎవరో వచ్చిన అలికిడి అయినట్లనిపించి తలెత్తి చూశాడు.

రామిగాడు నిలబడి వున్నాడు దీనంగా.

"రామిగా!" గబుక్కున అన్నాడు శ్యామలరావు.

వెంటనే తలెత్తింది శారద. కొడుకును చూడగానే నిలబడింది.

వాడు-"అమ్మా!" అని రివ్వున వచ్చి శారదను చుట్టుకు పోయాడు.

శ్యామలరావుకు చెప్పలేనంత సంతోషం కలిగింది. రాడనుకున్న కొడుకు ఇంటికి తిరిగి వచ్చాడు.

ఎలా రాగలిగాడు? తనకోసమా?

ఆ రోజు తను ఇంట్లో నించి వెళ్ళిపోయినతర్వాత 'మళ్ళీ ఎందుకు ఆ ఇంటికి వెళ్ళలేక పోయాడు?'

ఈ ప్రశ్నకు అతనికి జవాబు దొరకలేదు. భార్య కేసి చూశాడు. ప్రేమగా కొడుకు తల నిమురుతోంది.

ఇప్పుడు శ్యామలరావుకి అర్థమయింది-ఆ రోజు తనకు తల్లి లేదు. ఇప్పుడు రామిగాడికి తల్లి వుంది-తల్లిప్రేమవుంది. *


